క్లుప్తంగా

తల్లిదండ్రులపై కొడుకు దాడి

మెట్‌పల్లి: తల్లిదండ్రులపై కొడుకు దాడి చేసిన ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. స్థానిక బోయవాడకు చెందిన ఎల్ల గంగనర్సయ్య, రమాదేవి దంపతులకు అన్వేష్(35) కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా అతని మానసిక స్థితి సరిగ్గా లేదు. ఈ నేపథ్యంలో వేకువజామున 3గంటలకు నిద్రలో ఉన్న తల్లిదండ్రులపై కత్తి, కొడవళ్లతో ఒక్కసారిగా దాడికి దిగాడు. ఈ సంఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. గంగనర్సయ్య ఫిర్యాదు మేరకు అన్వేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధురాలి బలవన్మరణం

పెగడపల్లి: నంచర్ల గ్రామానికి చెందిన దాసరి రాధవ్వ(85) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రవికిరణ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. వృద్ధాప్యంలో ఉన్న రాధవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. అనారోగ్య సమస్య భరించలేక జీవితంపై విరక్తితో బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లింది. గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ బావిలో దూకింది. మృతురాలి కుమారుడు రాయమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రికార్డులు తనిఖీ

కోరుట్ల: పట్టణంలోని హైస్కూళ్లలో ఇంటర్నల్ మార్కుల రికార్డులను బుధవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు చిరుమల్ల ఆనంద్, కల్లెడ ప్రణయ్, తునికి వెంకటసుధీర్ అన్ని సబ్జెక్టుల్లో మార్కుల రికార్డులను పరిశీలించారు. కేరళ హైస్కూల్ ప్రిన్సిపాల్ సెలీనా భారి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి

గొల్లపల్లి: చందోలి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. జగిత్యాల, మల్యాల సీడీపీవో వీరలక్ష్మి మాట్లాడారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుంటూ భారత దేశ ప్రగతికి రథచక్రాలుగా మారాలన్నారు.

చందోలిలో నేత్ర వైద్యశిబిరం

గొల్లపల్లి: చందోలి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది పాల్గొనగా.. 70 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు.

మహిళా సాధికారతపై అవగాహన

కోరుట్ల: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మోహన్‌రావుపేట గ్రామంలోని ఉన్నత పాఠశాలల్లో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సైకాలజిస్ట్ గౌతమ్‌కుమార్, మహిళా సాధికారత, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయండి

జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని చెరువుల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హైదరాబాద్‌లో కలిసి కోరారు. చల్‌గల్, మోతె చెరువుల మరమ్మతు, గుల్లపేట చెక్‌డ్యామ్, రాయికల్ మండలం జగన్నాథపూర్‌లో ఎత్తిపోతలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రత్యేక కౌంటర్ సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: రాయికల్ బల్దియాలో 2024–25 సంవత్సరానికి గాను ఇంటి పన్ను, నల్లా బిల్లు, ట్రేడ్ లైసెన్స్, ఎంక్రోజ్‌మెంట్ ఫీజులు మార్చి 31తో ముగుస్తున్నందున కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటి బుధవారం తెలిపారు. బిల్లుల వసూళ్లకు వచ్చే బిల్ కలెక్టర్లకు సహకరించాలని కోరారు.

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి



సామగ్రి అందజేస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి: యువత సామాజిక సేవలో పాలుపంచుకోవాలని సీఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని దీన్‌దయాళ్‌నగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన రమ్య అనే యువతి వివాహానికి స్థానిక ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సహాయం చేసేందుకు ముందుకొచ్చారు. బుధవారం సీఐ నిరంజర్‌రెడ్డి చేతుల మీదుగా పుస్తె, మెట్టెలు, పట్టుచీరతోపాటు ఇతర సామగ్రి అందజేశారు. అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.



కోతుల బెడదకు కొండెంగ బొమ్మతో చెక్

జగిత్యాలరూరల్: గ్రామాల్లో కోతుల బెడత విపరీతంగా పెరిగింది. రైతులు వేసిన పంటలతోపాటు కూరగాయలు, పండ్ల తోటలను కోతులు ధ్వంసం చేస్తున్నాయి. నర్సరీలో పెంచుతున్న మొక్కలను కోతులు ధ్వంసం చేస్తుండటంతో.. పొరండ్ల గ్రామ పంచాయతీ సెక్రటరీ కిరీటి కొండెంగ ఫ్లెక్సీ ముద్రించి గ్రామంలో చాలాచోట్ల ఏర్పాటు చేశారు. దీంతో కోతులు ఆ ప్రాంతానికి రాకుండా భయాందోళన చెందుతున్నాయి. రైతులు కూడా కొండెంగతో ఉన్న ఫ్లెక్సీలను ముద్రించి పంటల వద్ద ఏర్పాటు చేస్తున్నారు.



నీరంతా వృథా..

ధర్మపురి: పట్టణంలోని తెనుగువాడలో నల్లా నీరు లీకై రోడ్డుపై వృథాగా పోతోంది. చాలా రోజుల నుంచి నీరు లీకవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులంటున్నారు. ప్రస్తుతం పట్టణంలో అనేక ఇళ్లకు నల్లా నీరందడమే కష్టమవుతున్న తరుణంలో వేలాది లీటర్ల మంచి నీరు ఇలా వృథా కావడం సరికాదన్నారు. పైపులకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.



కర్ణాటకలో ఒగ్గు కళాకారుల ప్రదర్శన

గొల్లపల్లి: కర్ణాటకలో న్యూఢిల్లీ మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద సంగీత ఉత్సవాల్లో గొల్లపల్లి మండలానికి చెందిన ఒగ్గుడోలు కళాకారులు అద్భుతమైన ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ మట్టి కళారూపం అయిన ఒగ్గుడోలు ప్రదర్శన మండలంలోని ఆత్మకూరు నుంచి దీకొండ ఒగ్గు పర్వతాలు కళాబృందం ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. ఒగ్గుడోలు విన్యాసాలతో, తాళమేళాలతో, గజ్జెల నాదాలతో ఆకట్టుకున్నారు. రాజశేఖర్, రితిక్, కోమర్, అంజిత్, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు

శిథిలావస్థలో ఎస్సారెస్పీ కాలువ

- దెబ్బతిన్న కాలువ లైనింగ్
- ఏళ్లుగా మరమ్మతు కరువు
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వంపై అదనపు భారం



ఎస్సారెస్పీ కాలువకు భారీ గండి

మల్యాల: ప్రతి నీటి బొట్టును ఒడిసి పడుతూ, పంట పొలాలకు నీరందించాలనే లక్ష్యం నీరుగారుతోంది. ఎస్సారెస్పీ కాలువ శిథిలావస్థకు చేరినా.. ఏళ్లుగా మరమ్మతు చేపట్టకపోవడంతో కాలువ లైనింగ్ దెబ్బతిని నీరు వృథా అవుతోంది. కాలువ లైనింగ్‌కు భారీ గుంతలు పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువపై ఉన్న రోడ్డుపై సైతం గుంతలు పడడంతో.. ట్రాక్టర్లు వెళ్లేందుకు వీల్లేకుండా ప్రమాదకరంగా మారింది. టెండర్ల ప్రక్రియ పూర్తయినా పనులు చేయించడంలో నిర్లక్ష్యంతో నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. మల్యాల మండలంలోని ఎస్సారెస్పీ కాలువ శిథిలావస్థకు చేరి నీటి ప్రవాహం తగ్గుతుండడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. కాలువ లైనింగ్ పూర్తిగా దెబ్బతినడంతోపాటు నీటి ప్రవాహానికి కాలువ లైనింగ్ భారీ కోతలకు గురైంది. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన కాలువ లైనింగ్ దెబ్బతినడంతోపాటు చెట్లు పెరిగి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. దీంతో కాలువ లైనింగ్ మరింతగా దెబ్బతింటోంది. మల్యాల మండలం తక్కళ్లపల్లి శివారులోని కొంపల్లె చెరువు నుంచి పెగడపల్లి మండల అయితిపల్లి వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర ఎస్సారెస్పీ కాలువ లైనింగ్ దెబ్బతింది. తాటిపల్లి శివారులోని లింక్ కెనాల్ ఎస్సారెస్పీ కాలువ కలిసే చోట నీటి ప్రవాహానికి భారీ గుంత పడింది. వర్షాకాలంలో పూర్తిగా కూలిపోయే ప్రమాదముంది.

కాలువ శిథిలం

68 నుంచి 75 వరకున్న తూముల ద్వారా లంబాడిపల్లి, తక్కళ్లపల్లి, తాటిపల్లితోపాటు పెగడపల్లి మండలం దోమలకుంట, అయితిపల్లి, పలు గ్రామాల్లో వందలాది ఎకరాలకు నీరందించే ఎస్సారెస్పీ కాలువ శిథిలావస్థకు చేరింది. చివరి ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

ఎస్సారెస్పీ కాలువ లైనింగ్ మరమ్మతులతోపాటు కొంపల్లె చెరువు వద్ద వంతెన నిర్మాణం, తూముల మరమ్మతు కోసం 2018–19లో రూ.8.50కోట్లకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. కాలువ పనులు చేపట్టేందుకు అధికారులు చొరవ చూపకపోవడంతో ఐదేళ్లుగా పనులు ప్రారంభం కాలేదు. ఐదేళ్ల క్రితం నాటి నిర్మాణ వ్యయంతో సదరు కాంట్రాక్టర్ ఎస్సారెస్పీ కాలువ మరమ్మతు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. తాను అప్పటి ధరలతో నిర్మాణ పనులు చేపట్టలేనని చేతులెత్తేశాడు. దీంతో ప్రస్తుత ధరల్లో కాలువ మరమ్మతు పనులకు సుమారు మరో రూ.4కోట్ల వ్యయం అదనంగా కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లింది.

అధికారులే బాధ్యత వహించాలి



ఎస్సారెస్పీ కాలువ మరమ్మతు పనులు చేపట్టడంలో కాంట్రాక్టు నిర్లక్ష్యానికి తోడు అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో మరమ్మతు పనులు పూర్తి కాలేదు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వం నష్టపోవాల్సి వస్తోంది. మరమ్మతులకు అదనంగా అయ్యే వ్యయాన్ని అధికారుల నుంచి వసూలు చేయాలి. – బింగి వేణు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

మరమ్మతు పనులు చేపట్టాలి



ఎస్సారెస్పీ కాలువ మరమ్మతు పనుల్లో నిర్లక్ష్యంపై విచారణ చేపట్టి కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలి. అధికారుల నిర్లక్ష్యంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. తక్షణమే ఎస్సారెస్పీ కాలువ మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. – పొన్నం మల్లేశం, రైతు, తాటిపల్లి



మానాలలో నృసింహుని రథోత్సవం

మల్యాల: మండలంలోని మానాల గ్రామంలో గల శ్రీనల్లగుట్ట లక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారిని రథంపై ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

విప్ పూజలు



మేడిపల్లి: భీమారం మండలం ఒడ్యాడ్ గ్రామంలో జరుగుతున్న సింగరాయ నరసింహస్వామివారి జాతరలో విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆధ్యాత్మికం..

అంబారిపేట ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: అంబారిపేట గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్–రాధిక దంపతులు పూజలు చేశారు.



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దంపతుల పూజలు

తాటిపల్లి గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి పూజలు చేశారు.

జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. చిన్నారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పూజలు చేశారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

జగిత్యాలటౌన్: పట్టణంలోని పురాణిపేట శ్రీలక్ష్మీనర్సింహస్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల పూర్ణానందాచార్యుల నేతృత్వంలో శాస్త్రోక్తంగా జరిపారు.

ఆలయ గిరి ప్రదక్షిణ

వెల్గటూర్: కిషన్‌రావుపేట లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకొని గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలు

మెట్‌పల్లి: బోయవాడలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం బ్రహ్మోత్సవాలు నిర్వహించారు.

ఘనంగా జాతరోత్సవాలు



సంగెంలో స్వామివారి రథోత్సవం

కోరుట్ల రూరల్: సంగెంలో శ్రీసీతారామస్వామి, గుమ్లాపూర్‌లో శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయాల్లో జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రథోత్సవం, పల్లకీసేవ జరిగింది. కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు గుమ్లాపూర్‌లో పూజలు చేశారు. గడ్డం వెంకటేశ్, చీటి స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో..

రాయికల్: ఇటిక్యాల గ్రామ శివారులోని గుట్టపై లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర మహోత్సవంలో భాగంగా పండితులు శ్రీపాద లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తహసీల్దార్ ఖయ్యూం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

పెగడపల్లి: లింగాపూర్‌లో శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి.

లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గొల్లపల్లి: శ్రీరాములపల్లె గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా బుధవారం నాలుగో రోజు వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

లక్ష్మీనర్సింహస్వామి జాతర

మల్లాపూర్: వెంకట్రావ్‌పేట, పాతదాంరాజుపల్లి, గొర్రెపల్లి, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లో బుధవారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

స్వామివారి కల్యాణం



కథలాపూర్: తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి, పోతారం, కలిగోట గ్రామాల్లో శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర ఉత్సవాలు నిర్వహించారు. గుట్టలపై ఉన్న దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఏనుగు మనోహర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



వెంకట్రావ్‌పేటలో జాతర ఉత్సవాల్లో పాల్గొన్న జువ్వాడి నర్సింగరావు

మల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన జాతర మహోత్సవాల్లో పాల్గొన్నారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ఏఎంసీ చైర్మన్లు అంతడుపుల పుష్పలతనర్సయ్య, కూన గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ జయంతి

మెట్‌పల్లి: ఆధ్యాత్మిక గురువు సంత్ రవిదాస్ జయంతిని పట్టణంలో బుధవారం మోచీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటంతో పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. సంఘ భవనంలో పూజలు చేశారు.

వాటర్ ప్లాంట్ బహూకరణ

వెల్గటూర్: కిషన్‌రావుపేటలోని శ్రీనాగపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి రాజక్కపల్లి గ్రామానికి చెందిన బోడకుంటి తిరుపతి–సువర్ణ దంపతులు వాటర్ ప్లాంట్ బహూకరించారు.



సారంగాపూర్: అడవుల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడంతో అడువులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. సారంగాపూర్–లక్ష్మీదేవిపల్లి ప్రధాన రహదారిపై బతుకమ్మ కుంట వద్ద మంగళవారం అడవిలో నిప్పు రాజేసుకోవడంతో అడవి కాలిపోతోంది. రోడ్డు వెంట వెళ్తున్న వారు, అవసరాల కోసం అడవుల్లోకి వచ్చే గ్రామస్తులు చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి అంటించి ఆర్పకపోవడం, తునికి ఆకు బాగా రావాలని నిప్పంటించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవికుమార్, సెక్షన్ అధికారి, సారంగాపూర్, ఫోన్ నంబర్: 9949557176

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సంక్షిప్త వార్తలు

మౌలిక వసతుల కల్పనకు పీఎంశ్రీ నిధులు

జగిత్యాల: పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పీఎంశ్రీ నిధులు మంజూరయ్యాయని డీఈవో రాము అన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు

గొల్లపల్లి: రానున్న వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ డివిజనల్ అధికారి రాజిరెడ్డి అన్నారు. బుధవారం మల్లన్నపేట సబ్ స్టేషన్‌లో 3 కిలోమీటర్ల మేర కొత్త 33 కేవీ లైన్‌ను ప్రారంభించారు.

పెగడపల్లిలో సమ్మక్క జాతర

పెగడపల్లి: పెగడపల్లిలో బుధవారం సమ్మక్క–సారక్క జాతర ఘనంగా ప్రారంభమైంది. శ్రీరాజరాజేశ్వర దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎగ్గల కుంట ప్రాంతంలో సమ్మక్క–సారక్క జాతర ఏర్పాటు చేశారు. మినీ జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

దుకాణాల నిర్వహణకు వేలం

పెగడపల్లి: పెగడపల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ దుకాణాల ఏర్పాటు కోసం వేలం పాటలు బుధవారం నిర్వహించారు. లడ్డు, పులిహోర, కంకణాలకు వేలం పాట నిర్వహించగా.. రూ.2,77,348 ఆదాయం సమకూరింది.

మోడల్ స్కూల్‌లో చేరండి

కథలాపూర్: మోడల్ స్కూల్‌లో ఆరోతరగతి, ఇంటర్ కోర్సుల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులు చేరాలని కథలాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిత అన్నారు. బుధవారం చింతకుంట, దుంపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మోడల్ స్కూల్‌పై వివరించారు.

కళాశాలల్లో అన్ని సబ్జెక్టుల బోధన

సారంగాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అన్ని సబ్జెక్టులకు బోధన జరుగుతుందని జూనియర్ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. బుధవారం సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అర్పపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంటర్‌లో సారంగాపూర్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు.

మహాసభ విజయవంతం చేయాలి

పెగడపల్లి: ఈనెల 22న జగిత్యాలలో నిర్వహించే భవన నిర్మాణ కార్మిక సంఘం 3వ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ కార్మికులను కోరారు. మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి బుధవారం కరపత్రం ఆవిష్కరించారు. నాయకులు శనిగరపు ప్రవీణ్, సురేశ్, శంకర్, పురుషోత్తం, అంజయ్య, రవి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

కథలాపూర్: చిన్నారులకు పౌష్టికాహారమందిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఆర్‌బీఎస్‌కే కోరుట్ల క్లస్టర్ వైద్యాధికారి సురేంద్ర అన్నారు. బుధవారం చింతకుంట, రాజారాంతండా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్, పెండింగ్ బిల్లుల రద్దు, డీఏలు, నూతన పీఆర్సీ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గల్ఫ్ బాధితుడిని స్వగ్రామానికి తెప్పించండి

జగిత్యాలరూరల్: మలేసియాలో చిక్కుకున్న బాధితుడిని స్వగ్రామానికి తెప్పించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం సీఎంకు లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లా యెర్గట్లకు చెందిన పోత్కూరి లింగారెడ్డి నిరుపేద. భార్య వికలాంగురాలు. ఉపాధి కోసం కువైట్ వెళ్లేందుకు వర్షకొండకు చెందిన ఓ ఏజెంట్‌కు రూ.90 వేలు ఇచ్చాడు. అతడు మోసం చేసి రెండేళ్ల పని ఒప్పందంపై మలేసియాకు పంపించాడు. అక్కడ లింగారెడ్డికి ఉపాధి లేక తిరుగుతుండగా బస్సు ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. వైద్యం చేయించుకునేందుకు స్థోమత లేకపోవడం, స్వగ్రామం వచ్చేందుకు ఖర్చులకు డబ్బు లేకపోవడంతో అక్కడే ఉండిపోయాడు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునిల్ కుమార్, టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీఎంకు లేఖ రాశారు.

విట్టంపేట వాసికి డాక్టరేట్

మెట్‌పల్లిరూరల్: విట్టంపేట గ్రామానికి చెందిన మునుగూరి పురుషోత్తం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.

కరాటేలో గోల్డ్ మెడల్

కోరుట్ల: కేరళ హైస్కూల్‌లో 8వతరగతి విద్యార్థి అబ్దుల్ మజీద్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ టోర్నమెంట్లో గోల్డ్ మెడల్ సాధించాడు.

స్థానిక సంస్థలకు సిద్ధం కావాలి

మల్యాల: బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు.